సాక్షి
వికారాబాద్

శుక్రవారం, 10, మే, 2024



ముమ్మర ఏర్పాట్లు

ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. 2లో▸



బీసీలు అండగా నిలవాలి

బీసీలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని ఆ పార్టీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి కోరారు. 2లో▸



నమ్మక ద్రోహి రంజిత్‌రెడ్డి

బీఆర్‌ఎస్ పార్టీకి రంజిత్‌రెడ్డి నమ్మక ద్రోహం చేశారని తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ఆరోపించారు. 2లో▸

న్యూస్‌రీల్

తడిసిన ధాన్యాన్ని కొంటాం

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



తడిసిన ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న మనోహర్‌రెడ్డి తదితరులు

యాలాల: అకాల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాస్నం వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్‌కు ఫోన్ చేసి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. ఎలాంటి కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఆయన వెంట నాయకులు నర్సిరెడ్డి, మాజీ ఎంపీపీ పురుషోత్తంరావు, కోఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, మాజీ సర్పంచ్ హన్మంతు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మండలంలోని రేళ్లగడ్డ తండాకు చెందిన బీఆర్ఎస్ మాజీ ఉప సర్పంచ్ మాల్యానాయక్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గోవింద్ నాయక్ మరి కొందరు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం యాలాలలో బీజేపీకి చెందిన పలువురు హస్తం పార్టీలో చేరారు.

కాంగ్రెస్ వచ్చింది కరువు తెచ్చింది

- సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే 'పాలమూరు' పూర్తి చేయాలి
- మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

వికారాబాద్: కాంగ్రెస్ వచ్చింది.. ఐదు నెలల్లోనే కరువు తెచ్చిందని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా గురువారం వికారాబాద్‌లోని కొండా బాలకృష్ణారెడ్డి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సీఎం రేవంత్ సొంత జిల్లాను కూడా విస్మరించారని, ప్రతిసారీ కొడంగల్ అంటున్నారు.. నిధులన్నీ ఆ నియోజకవర్గానికే కేటాయిస్తున్నారు.. వికారాబాద్, పరిగి, తాండూరు ఆయన సొంత జిల్లాలోని కావా..? అని ప్రశ్నించారు. ఈ ప్రాంతాన్ని పట్టించుకోని సీఎంకు కర్రుగాల్చి వాత పెట్టాలన్నారు. సొంత జిల్లాపై చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. గెలిచి నాలుగు నెలలైనా ఒక్కసారైనా పాలమూరు గురించి మాట్లాడారా..? అధికారులతో సమీక్ష నిర్వహించారా అని నిలదీశారు. కనీసం పాలమూరు ఎక్కడుందో.. కాలువలు ఎక్కడున్నాయో కూడా తెలియదని విమర్శించారు. ఆరు గ్యారంటీలని అధికారంలోకి వచ్చి మహిళలను బస్సు ఎక్కించడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. గతంలో మహిళలు కనిపిస్తే బస్సు ఆపేవారని, ఇప్పుడు వారు కనిపించగానే పక్కకు తిప్పుకొని పోతున్నారని తెలిపారు. కాంగ్రెస్ వచ్చాక మహిళలకు గౌరవం లేకుండా పోయిందన్నారు. మహిళలకు నెలనెలా ఇస్తామన్నా రూ.2,500 ఇస్తున్నారా..? రూ.2 లక్షల రుణమాఫీ ఇచ్చారా..? పింఛన్లు రూ.4 వేలు చేశారా..? పేదలకు ఉచిత కరంట్ అమలు చేస్తున్నారా..? పంటకు రూ.500 బోనస్ ఇస్తున్నారా.? కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇచ్చిండ్రా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. కేంద్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రజలకు ఏం చేశారో చెప్పకుండా అక్షింతలు తీసుకొని, నెత్తిన చల్లుకొని ఓటేయాలని అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. వారిచ్చిన అక్షింతలు నెత్తిమీద చల్లుకొని కారు గుర్తుకు ఓటేసి వారికీ కర్రుగాల్చి వాత పెట్టాలన్నారు. కేసీఆర్ వికారాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయడంతో పాటు అన్ని వనరులు సమకూర్చారని పేర్కొన్నారు. కలెక్టరేట్, మెడికల్ కళాశాల ఇలా ఎన్నో ఇచ్చారని తెలిపారు. పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి నమ్మక ద్రోహులకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.

సేవ చేసే వారిని గెలిపించాలి: కాసాని

జిల్లాలో సబ్బండ వర్గాల కోసం ఎంతో చేశా.. నాగురించి మీకందరికీ తెలుసు.. నన్ను గెలిపించడం ద్వారా మరింత సేవ చేసే అవకాశం కల్పించాలని బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల గురించి అందరికీ తెలుసని, వారి గురించి కొత్తగా చెప్పేదేమీ లేదన్నారు. కేసీఆర్ పాలనను మరోసారి ప్రజలకు గుర్తు చేయాలని కోరారు. అనంతరం శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసే గొప్ప మనసున్న వ్యక్తి కాసాని అని, ఆయన్ను గెలిపించుకుందామని కోరారు. బీసీలకు లేకలేక వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ మోస పూరిత వాగ్దానాలను ఎండగట్టాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ రాగానే పాత రోజులు మళ్లీ వచ్చాయని తెలిపారు. జిల్లాను తీసేస్తే మరో తెలంగాణ ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు.



రోడ్‌షోలో మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మోదీతో ప్రపంచస్థాయి గుర్తింపు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి

పరిగి: ప్రపంచ స్థాయిలో భారత్‌కు గౌరవం తెచ్చింది ప్రధాని నరేంద్ర మోదీ అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి అన్నారు. గురువారం పట్టణంలో బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి గిరిజన మోర్చా సమావేశం నిర్వహించారు. కొడంగల్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు రోడ్‌షో సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చేవెళ్లలో నిజాయితీకి, గుడ్లు, దాణా స్కాంలకు జరుగుతున్న ఎన్నికలని అన్నారు. కొండాను 2లక్షల మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ చేసిందేమీ లేదు: కొండా

అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. అరవై ఏళ్ల పాలనలో కాంగ్రెస్ దేశ ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. బీజేపీ హయాంలో ప్రజలు హాయిగా జీవిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ షాద్‌నగర్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కరణం ప్రహ్లాద్‌రావు, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, నాయకులు పెంటయ్య గుప్తా, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గీత దాటితే వాతే..

లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాల్సిందే
- ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవు
- 48 గంటల ముందే బల్క్ ఎస్‌ఎంఎస్‌లు బంద్
- 'సాక్షి'తో చేవెళ్ల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కు గడువు దగ్గర పడుతోంది. శనివారం సాయంత్రం ఆరు గంటలకు ప్రచారం ముగియనుంది. పోలింగ్‌కు 48 గంటల ముందు రాజకీయ అంశాలకు సంబంధించిన బల్క్ ఎస్‌ఎంఎస్‌లు పంపడం నిషేధం. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది' అని చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

చేవెళ్ల లోక్‌సభ స్థానంలో మొత్తం 29,38,370 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 15,04,260 మంది పురుషులు, 14,33,830 మంది మహిళలు, 280 మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. మొత్తం 43 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఏడు నియోజక వర్గాల పరిధిలో ఇప్పటికే 2,877 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఎన్నికల విధుల కోసం 23 వేల మంది సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. 10,791 బ్యాలెట్ యూనిట్లు, 3,594 కంట్రోల్ యూనిట్లు, 4,025 వీవీ ప్యాట్ యంత్రాలు సిద్ధం చేశాం.

తనిఖీలు ముమ్మరం

ఓటర్లను ప్రభావితం చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాం. జిల్లా సరిహద్దుల్లోనే కాకుండా ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, తనిఖీలు నిర్వహిస్తున్నాం. ఎన్నికల తనిఖీల్లో భాగంగా ఈ నెల 6వ తేదీ వరకు రూ.41.81 కోట్లకుపైగా విలువ చేసే నగదు, మద్యం, బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నాం.

సైలెన్స్ పీరియడ్‌లో అన్నీ బంద్

శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు సైలెన్స్ పీరియడ్‌గా పిలుస్తారు. ఈ సమయంలో ర్యాలీలు, ఇంటింటి ప్రచారం, బల్క్ ఎస్‌ఎంఎస్‌లు పంపడం నిషేధం. నిబంధనలు ఉల్లఘించిన వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తాం. ఈ సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. మద్యం షాపులు కూడా బంద్ చేయాల్సిందే.

హోటళ్లు, లాడ్జీలు ఖాళీ చేయాలి

పోలింగ్ సమయంలో జిల్లాయేతర వ్యక్తులు ఎవరూ కూడా జిల్లాలో ఉండకూడదు. ఒకవేళ ఉన్నట్లు తేలితే చర్యలు తప్పవు. ఎఫ్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, ఎంసీసీ, పోలీసు అధికారులంతా అప్రమ త్తంగా ఉండాలి. కల్యాణ మండపాలు, హోటళ్లు, లాడ్జింగ్‌లు, తనిఖీ చేయాలి.

ఆ ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

12,13 తేదీల్లో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ అనుమతి లేకుండా ప్రచార ప్రకటనలు ప్రచురించకూడదు.

క్లుప్తంగా

ఉపాధి కూలీ మృతి


కావలి లక్ష్మి (ఫైల్)

ధారూరు: ఉపాధిహామీ కూలీ అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన వికారాబాద్ జిల్లా ధారూరు మండలం గురుదోట్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కావలి లక్ష్మి(40), బుధవారం గ్రామ సమీపంలో జరుగుతున్న ఉపాధి పనులకు వెళ్లింది. రోడ్డు కంత వెంబడి మైసమ్మగుడి వరకు ఉన్న రోడ్డులో మట్టి తీసే పనులు చేసిన ఆమె అస్వస్థతకు గురియై ఇంటింటికి వచ్చేసింది. ఇంటికి వచ్చిన ఆమె మంచినీళ్లు తాగి ఒంట్లో బాగా లేదని పడుకుంది. చలనం లేనట్లుగా పడుకున్న ఆమెను భర్త బలవంతంగా లేపి ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా స్పృహ తప్పి పడిపోయింది. దీంతో వెంటనే వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్ మార్గమధ్యలోనే మృతి చెందిందని చెప్పారు. వడదెబ్బ తగిలి మృతి చెంది ఉంటుందని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలు శిక్ష

మరో తొమ్మిది మందికి జరిమానా

తాండూరు టౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 14 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వీరిలో మిట్టబాస్పల్లికి చెందిన మొగులప్ప, కుప్పన్‌కోట్‌కు చెందిన రాజు, కోటబాస్పల్లికి చెందిన రాజేశ్, తాండూరు పట్టణానికి చెందిన భానుప్రసాద్, ఎర్రవల్లికి చెందిన నాగరాజులకు రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ. 1000 జరిమానా, తాండూరు సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నామాల అశోక్ విధించారు. అలాగే మరో తొమ్మిది మందికి రూ. 1000 చొప్పున జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ సంతోష్‌కుమార్ హెచ్చరించారు.

ఓటు హక్కుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న రాణి

పెద్దేముల్: ఓటు హక్కు ఆయుధం లాంటిదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్దేముల్ మండల అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి అన్నారు. గురువారం పెద్దేముల్ మండల కేంద్రంతో పాటు గోపాల్‌పూర్, ఇతర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో వృద్ధులు-దివ్యాంగులకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటు హక్కుపై ప్రభుత్వం అన్ని విధాల సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలియచేశారు. ఓటు హక్కును ఎవరైనా స్వేచ్ఛగా వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు లలిత, లక్ష్మి, రేణుక, సీసీ నర్సమ్మ, పంచాయతీ కార్యదర్శులు చంద్రయ్య, కారోబార్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ కృషి

ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి


నాగరాజు దంపతులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

కుల్కచర్ల: ప్రజల సంక్షేమమే తమ అభిమతమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామంలో కుల్కచర్ల మాజీ జెడ్పీటీసీ మంజుల, కుల్కచర్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు దంపతులు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు సేవచేయాలన్న తలంపు ఉన్న నాయకులకు పార్టీ, తాము వ్యక్తిగతంగా అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్‌లోకి నాగరాజు దంపతులు రావడం ఎంతో సంతోషకరమన్నారు. ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడిపని చేయాలని, రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి

తలకొండపల్లి: మండల పరిధికి చెందిన ఓ బాలికపై అత్యాచారం జరిగినట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ గురువారం తెలిపారు. బుధవారం రాత్రి 15 ఏళ్ల బాలిక రోడ్డుపై వెళుతుండగా ఓ అబ్బాయి పడుబడిన బంగ్లాకు తీసుకుపోయి అఘాయిత్యం చేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆశలు రాలిపాయె!


బొంరాస్‌పేట: మెట్లకుంటలో నేలరాలిన మామిడికాయలు

- నేలరాలిన మామిడికాయలు
- మెట్లకుంట, తుంకిమెట్ల గ్రామాల్లో తీవ్ర నష్టం
- అధికారుల పరిశీలన, నష్టపరిహారంపై ఆశలు

బొంరాస్‌పేట: లక్షల్లో ఆదాయం వస్తుందని పెట్టుకున్న ఆశలు నేలరాలి పోయాయి. రెండు రోజులుగా రాత్రి సమయంలో వీస్తున్న ఈదురు గాలులు, అకాల వర్షం అన్నదాతకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చివరి దశలో అమ్ముకుంటే అధికలాభం వస్తుందని అనుకున్న మామిడి రైతులకు కాయలు నేలరాలి నష్టాల్లో ముంచింది. బుధవారం రాత్రి వీచిన బలమైన ఈదురుగాలులు, కురిసిన అకాలవర్షం మండల పరిధిలోని మెట్లకుంట, తుంకిమెట్ల గ్రామాల్లో మామిడితోటలు నేలపాలై రైతులకు తీవ్ర నష్టం కలిగించింది.

నష్ట పరిహారంపై అశలు

తుంకిమెట్లలో గిరింధర్‌గౌడ్‌కు చెందిన నాలుగు ఎకరాల్లోని మామిడితోట రూ.2.5లక్షలకు అమ్ముకునే మామిడికాయలు రూ.60వేలకే అమ్ముకున్నాడు. రూ.1.90వేల నష్టంతో అమ్ముకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా బొంరాస్‌పేట, మెట్లకుంట, తుంకిమెట్ల, నాగిరెడ్డిపల్లి, రేగడిమైలారం నాందార్‌పూర్ తదితర గ్రామాల్లో మామిడి కాయలు పెద్ద ఎత్తున నేలరాలిపోయాయి. మెట్లకుంట, తుంకిమెట్ల గ్రామాల్లో అధికారులు పరిశీలించారు. నష్టపరిహారం ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులకు విన్నవించుకున్నారు. అలాగే, పలు గ్రామాల్లో వరిధాన్యం నేలరాలి బురదమయమైంది. కోతకొచ్చిన వరి పంట, కోసి ఆరబోసుకున్న వరిధాన్యం తడిసిపోయింది. తడిసిన వరిధాన్యం ఆరబెట్టుకోవడానికి రైతులు అవస్థలు పడుతున్నారు. మరో రెండు రోజులు అలాగే ఉంటే రైతులు మరింత నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చర్యలు ముమ్మరం చేయాలని, టార్పలిన్ కవర్లు అందజేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


దోమ: ఇళ్ల మధ్యలో పడిపోయిన విద్యుత్ స్తంభం

ఈదురు గాలుల బీభత్సం

దోమ : మండలంలో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయి.. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అలాగే, ఆయా గ్రామాల్లోని కోతలు కోసి ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయింది. దీంతో అన్నదాతలు చేతికొచ్చిన ధాన్యం నేలపాలయిందని వాపోయారు. బొంపల్లి గ్రామంలో ఈదురు గాలులకు మామిడి కాయలు రాలి తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

తీవ్ర నష్టం వాటిల్లింది..



''మా తోటలో మామిడికాయలు వడ్లు రాలినట్లే రాలాయి. ఏడున్నర ఎకరాల్లో మామిడితోట ఉంది. ప్రతియేటా రూ.6లక్షల కుపైగా ఆదాయం వచ్చేది. కాని ఊపిరి పీల్చుకోవడానికి వీలుకాని ఈదురు గాలులు, అకాల వర్షంతో తోట మొత్తం కాయలు నేలరాలిపోయాయి. ఎప్పుడూ కౌలుకు ఇచ్చేవాళ్లం. ఈ సారే సొంతంగా పెట్టుబడి పెట్టాం. పెద్ద దిక్కుగా ఉన్న మామిడికాయలే నెత్తిన చేతులేయించాయి.''

–కావలి సత్యయ్య, రైతు, మెట్లకుంట, బొంరాస్‌పేట మండలం

వసతుల బాధ్యత నోడల్ అధికారులదే

- ఒక్కో పోలింగ్ కేంద్రానికి రూ. 5వేలు కేటాయింపు
- పార్లమెంట్ ఎన్నికల జిల్లా మానిటరింగ్ సభ్యుడు జెడ్పీ సీఈఓ సుధీర్


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ సుధీర్

తాండూరు టౌన్: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన బాధ్యత నోడల్ అధికారులదేనని పార్లమెంటు ఎన్నికల జిల్లా మానిటరింగ్ సభ్యుడు, జెడ్పీ సీఈఓ సుధీర్ స్పష్టం చేశారు. గురువారం ఆయన తాండూరు పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో నోడల్ అధికారులు, ఎంపీడీఓలు, సెక్టార్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పోలింగ్ కేంద్రంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా ఒక్కో కేంద్రానికి రూ. 5వేలు ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. వేసవికాలం కావడంతో టెంట్లు, తాగునీరు వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. అలాగే, సెక్టార్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలని ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల అశ్రద్ధ వహించరాదని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ కిషన్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, ఎంపీడీఓలు, మాస్టర్ ట్రైనర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ప్రధాన కార్యదర్శిగా రజాక్


రజాక్ పాషను సన్మానిస్తున్న నేతలు

కుల్కచర్ల: బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా రజాక్ పాషను నియమించారు. గురువారం కుల్కచర్ల మండల పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రహ్లాదరావు, స్థానిక నేతలు ఆయనను ఘనంగా సన్మానించారు. అబ్దుర జాక్ పాషను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ నియామక పత్రం జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రహ్లాదరావు మాట్లాడుతూ.. భారతీయ జనతా పార్టీ మైనార్టీలకు వ్యతిరేకం కాదని కేవలం ఇతర దేశాలకు చెందిన రోహింగ్యాలకు, మతమార్పిడిలకు పాల్పడే వారికి మాత్రమే వ్యతిరేకమని అన్నారు. మైనార్టీల సంక్షేమానికి బీజేపీ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. నాపై నమ్మకంతో పార్టీ ఇచ్చిన బాధ్యతను గౌరవంగా భావించి పార్టీ పటిష్ఠతకు పనిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఘణపురం వెంకటయ్య, కాటనిపల్లి అంజిలయ్య, వార్వాల అంజిలయ్య, మైపాల్, రాంచంద్రయ్య, శ్రీనివాస్, చెల్లాపూర్ అంజనేయులు పాల్గొన్నారు.

ఫిల్లింగ్ స్టేషన్‌ల్లో ఆకస్మిక తనిఖీ

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి ఫిల్లింగ్ స్టేషన్లను సంస్థ ఎండీ సుదర్శన్ రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎల్లారెడ్డి గూడ, వెంగళ్ రావు నగర్, ఎస్.ఆర్.నగర్, వెంకటగిరి, తట్టిఖాన ఫిల్లింగ్ స్టేషన్లను ఆకస్మికంగా సందర్శించిన ఆయన రికార్డులు, ట్యాంకర్ డెలివరీకి సంబంధించిన ఇన్ అండ్ ఔట్ లాగ్ బుక్స్ పరిశీలించారు. లాగ్ బుక్స్ సక్రమంగా నిర్వహించాలని.. అందులో డెలివరీ టైమింగ్స్ తప్పని సరిగా నమోదు చేయాలన్నారు. పెండెన్సీ క్లియర్ చేసేందుకు తగినంత సిబ్బందిని సమకూర్చుకోవాలని సూచించారు. డిమాండ్‌ను బట్టి.. డెలివరీ టైమింగ్స్‌ను కూడా పెంచుకోవాలన్నారు. ఫిల్లింగ్ స్టేషన్లలోని సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు.

బీజేపీని గద్దెదించడమే లక్ష్యం

చేవెళ్ల పార్లమెంట్ కో ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


ధారూరు: పీసీఎంతండాలో ప్రచారం నిర్వహిస్తున్న రాఘవన్‌నాయక్


పరిగి: కాంగ్రెస్ చేరుతున్న ఇతర పార్టీల నేతలు

పరిగి: ఇండియా కూటమి దేశానికి ఈ పరిస్థితుల్లో ఎంతో అవసరమని, బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా పనిచేస్తుందని చేవెళ్ల పార్లమెంట్ కో ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో సీపీఎం, సీపీఐ, టీజేఎస్ నాయకులతో విలేకరులతో మాట్లాడారు. సీపీఎం, సీపీఐ, టీజేఎస్ ఇండియా కూటమికి పూర్తి మద్దతు తెలుపుతున్నాయన్నారు. కమ్యూనిస్టు పార్టీల సూచనలు, సలహాలను తీసుకుని ముందుకు సాగుతామన్నారు. ఉద్యోగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

పూడూర్ మండలం చన్‌గోముల్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే, పరిగి మండలం రుక్కుంపల్లి, భర్కత్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, సతీష్, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బంజారాలంతా కాంగ్రెస్ వైపే

ధారూరు: బంజారాలంతా కాంగ్రెస్‌కు మద్దతుగా ఉన్నారని రాష్ట్ర గిరిజన నాయకుడు రాఘవన్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం ధారూరు మండలంలోని మైలారం, జీడిగడ్డతండా, శేరిగడ్డతండా, పీసీఎంతండా, కుమ్మర్‌పల్లితండాల్లో గిరిజన నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల పెన్నిధి కాంగ్రెస్ పార్టీని బలపర్చి చేయిగుర్తుకు ఓటేసి చేవెళ్ల ఎంపీగా రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్‌ల ఆధ్వర్యంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. దశాబ్ద కాలంగా బీఆర్‌ఎస్ మాటలు తప్పా చేసిందేమి లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకుల మాటలు విని తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో దేవేందర్ నాయక్, సీతారాంనాయక్, బాబునాయక్, రాందాస్‌నాయక్, రెడ్డియానాయక్, లాలునాయక్, చందర్ నాయక్ పాల్గొన్నారు.

బీసీలు అండగా నిలవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

అనంతగిరి: బీసీలంతా కాంగ్రెస్‌కు అండగా ఉండాలని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి కోరారు. గురువారం వికారాబాద్‌లోని గౌలికార్ ఫంక్షన్ హాల్‌లో బీసీ కులాల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమన్నారు. బీసీలంతా తనకు అండగా ఉండాలని, తాను 5ఏళ్ల పాటు వారికి వెన్నంటి ఉంటానన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, విక్రం, నరేష్, మహేష్, జిలానీ, మధు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి

యాచారం: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన యాచారం ఠాణాలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండికి చెందిన ఘన్సీయా(65) నగరంలోని ఉప్పుగూడలో నివాసం ఉంటున్నారు. గత నెల 28న నల్గొండ జిల్లా దేవరకొండలోని బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం ఆయన మోటార్ సైకిల్‌పై దేవరకొండకు వెళ్లారు. మార్గ మధ్యలో సాగర్‌రోడ్డుపై యాచారం మండల కేంద్రం వద్ద మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడి పోయారు. తీవ్ర గాయాలైన ఘన్సీయాను పోలీసులు 108లో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆయన గురువారం మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌కుమార్ తెలిపారు.

ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

ఆర్డీఓ సాయిరాం, ఏసీపీ కిషన్

చేవెళ్ల: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, ఏసీపీ బి.కిషన్‌లు అన్నారు. మండలంలోని పలు సమస్యాత్మక కేంద్రాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో జరిగిన పలు సంఘటనల దృష్ట్యా పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి వాటిని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి సమస్యలు, గొడవ లు జరగకుండా ఉండేందుకు పోలీస్ బందోబస్త్, పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎప్పటికప్పుడూ పోలింగ్ కేంద్రాలను పరివేక్షిస్తామని తెలిపారు. వారి వెంట చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, తహసీల్దార్ కృష్ణయ్య, సిబ్బంది ఉన్నారు.

ముమ్మర ఏర్పాట్లు


చేవెళ్లలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ కోటిరెడ్డి

- చేవెళ్లలో ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ నారాయణరెడ్డి
- అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశం
- ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వరాదని సూచన

అనంతగిరి: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపులో అప్రమత్తంగా ఉండాలని, అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం చేవెళ్ల సమీపంలోని బండారి శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లపై ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్లా, పోలీస్ పరిశీలకులు కాలురామ్ రావత్, పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, రంగారెడ్డి, వికారాబాద్, జిల్లాల కలెక్టర్లు శశాంక, నారాయణరెడ్డి ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్, పరిగి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును కళాశాలలోని రెండో అంతస్తులో, తాండూరు ఓట్ల లెక్కింపును మూడో అంతస్తులో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల సామగ్రి ఎక్కువగా ఉంటుందని, రెండు, మూడు అంతస్తుల్లోకి తరలించడానికి అవసరమైన సిబ్బందిని నియమించుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాలకు అధికారులు, సిబ్బంది, అభ్యర్థులు వెళ్లే దారి స్పష్టంగా తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కేటాయించిన కౌంటింగ్ కేంద్రాలను ఎస్పీ కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, పరిగి, తాండూరు నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో పరిగి, చేవెళ్ల తహసీల్దార్లు ఆనందరావు, కృష్ణయ్య, ఎన్నికల అధికారులు శంకర్ నాయక్, రెవెన్యూ, పోలీస్‌లు ఉన్నారు.

నమ్మక ద్రోహి రంజిత్‌రెడ్డి

- కొండా వేశం మార్చినంత మాత్రాన ప్రజలు నమ్మరు
- తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి


ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి

తాండూరు/తాండూరు టౌన్: బీఆర్‌ఎస్ పార్టీకి రంజిత్‌రెడ్డి నమ్మక ద్రోహం చేశారని తాండూరు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన పట్టణంలోని 9,10,11,12, 28వ వార్డుల్లో చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించాలని విస్తృత ప్రచారం చేశారు. అనంతరం సందర్భంగా రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ రంజిత్‌రెడ్డికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చిందని, స్వలాభం కోసం పార్టీ మారారని ఆరోపించారు. ప్రజలు ఆయనకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి వేశం మార్చినంత మాత్రాన ప్రజలు నమ్మే ప్రసక్తే లేదన్నారు. మత రాజకీయాలు చేస్తున్న బీజేపీని ప్రజలు విశ్వసించారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ చేస్తారనే నమ్మకం స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి లేదని, అందుకే తన సవాల్‌ను స్వీకరించడం లేదని ఎద్దేవా చేశారు. బడుగు బలహీన వర్గాల తరఫున నిరంతరం పోరాటం చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని గెలుపు తథ్యమన్నారు. కారు గుర్తుకే ఓటేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజుగౌడ్, నయీమ్, నర్సింహులు, శ్రీనివాసాచారి, పట్లోళ్ల దీప, సంగీతా ఠాకూర్, రాఘవేందర్, నరేందర్‌గౌడ్, అబ్దుల్ సలీం, వెంకట్‌రెడ్డి, యూసఫ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అన్ని కష్టాలే..

పరిగి: కాంగ్రెస్ అంటేనే కష్టాలు.. దేశానికి, రాష్ట్రానికి ఆ పార్టీ చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణ కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. తెలంగాణ గళం పార్లమెంట్‌లో వినిపించాలంటే.. కచ్చితంగా ప్రజలు కారు గుర్తుకు ఓటువేసి, బీఆర్‌ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత నాలుగు నెలల క్రితం అందించాల్సిన రైతుబంధు డబ్బులు పంటలు చేతికి వచ్చినా అందలేదని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, కౌన్సిలర్లు రవీందర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను రద్దు చేసేందుకు కుట్ర


పరిగిలో ఎన్నికల ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

వికారాబాద్ జిల్లాను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వికారాబాద్ జిల్లాను రద్దు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌ను మహబూబ్‌నగర్‌లో కలపాలనే ఉద్దేశంతో జిల్లా రద్దుకు పునుకొంటున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా నుంచి వికారాబాద్ జిల్లాగా మార్చేందుకు యంగ్ లీడర్స్ సంస్థ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యమం చేశానన్నారు. జిల్లా ఏర్పాటు చేయాలని 8 ఏళ్ల క్రితం పోస్టు కార్డుల ఉద్యమం ద్వారా రాష్ట్రపతికి పోస్టు కార్డులు పంపించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా చేసిన ఉద్యమ ఫలితంగానే వికారాబాద్ జిల్లాను నాటి సీఎం కేసీఆర్ సాకారం చేశారన్నారు. వికారాబాద్ జిల్లాను రద్దు చేసి చేవెళ్లను జిల్లాగా మార్చాలని చూస్తున్నారని చెప్పారు. జిల్లా రద్దు చేస్తే బీఆర్‌ఎస్ పార్టీ మరో ఉద్యమానికి సిద్ధమవుతుందని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు చేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అప్పు, నర్సింహులు, శ్రీనివాసచారి, సలీమ్, విజయ్ తదితరులున్నారు.

పోలింగ్‌కు సన్నద్ధం


ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న లింగ్యానాయక్

కొడంగల్: నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. గురువారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొడంగల్ నియోజకవర్గంలో 1,316 మంది ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాల్గొంటారని తెలిపారు. 329 మంది పీఓ, 329 మంది ఏపీఓ, 658 మంది అదర్ పోలింగ్ స్టాఫ్ ఉన్నారని చెప్పారు. ఈ నెల ఒకటవ తేదీ నుంచి 6వ తేదీ వరకు పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలో 2,41,794 మంది ఓటర్లు ఉన్నారని, 282 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే పోలింగ్ స్లిప్పులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉదయం సెక్టోరియల్ ఆఫీసర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోలింగ్‌ను పారదర్శకంగా జవాబుదారీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఐ భరత్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.